క్లుప్తంగా

నేత్రానందం.. ద్రౌపదీ కల్యాణం



కల్యాణోత్సవంలో భక్తులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం కృష్ణాపురంలోని శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల, శ్రీకృష్ణ దేవాలయంలో శనివారం మహాభారత యజ్ఞంలో భాగంగా ద్రౌపదీ కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తొలుత సంప్రదాయబద్ధంగా అమ్మవారికి, పంచపాండవులకు ఉభయదారులు పట్టువస్త్రాలు సమర్పించారు. తరువాత వధూవరులందరినీ కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. వేదపండితులు వేద మంత్రాలు పఠించి కల్యాణోత్సవాన్ని పూర్తిచేశారు. దీనికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు త్యాగరాజులు, రాము, మురుగ, దిలీప్, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

చిత్తూరు రూరల్: పల్లెల అభివృద్ధిపై దృష్టి పెట్టి, అన్ని విధాలుగా బాగు చేసుకోవాలని డీపీఓ లక్ష్మీ తెలిపారు. చిత్తూరు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆమె పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఈఓపీఆర్డీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వామిత్వ, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. పంచాయతీల్లో ప్రతిరోజు చెత్త సేకరణ చేయాలని వీధిలైట్ల నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులతోపాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లను వంద శాతం చేయించాలన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన అర్జీలను స్వీకరించాలని చెప్పారు. తదనంతరం డీపీఆర్పీ కో–ఆర్డినేటర్ షణ్ముగం పలు విషయాలపై చర్చించారు.

ఎయిడెడ్ ఉద్యోగుల సమస్యలపై వినతి

చిత్తూరు కలెక్టరేట్ : ఎయిడెడ్ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగుల ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నాదెండ్ల శ్రీమన్నారాయణ అన్నారు. ఆయన శనివారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. ఎయిడెడ్ నుంచి ప్రభుత్వంలోకి విలీనమైన ఇంటర్మీడియట్ ఉద్యోగుల సమస్యలను పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

హక్కులపై అవగాహన

యాదమరి: మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ చిట్టిబాబు తెలిపారు. మండలంలోని ముద్దరామాపురం దళితవాడలో శనివారం సాయంత్రం మానవహక్కులపై గ్రామీణ ప్రజలకు సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కుల గురించి తెలుసుకోవాలని చెప్పారు. ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ బాధితులు ఎవరైనా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, ఎలాంటి భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీడీఓ శివరాజ్ పాల్గొన్నారు.

ఓటరు అనుసంధానాన్ని పూర్తిచేయండి

పూతలపట్టు: బీఎల్ఓలు ఓటరు అనుసంధాన ప్రక్రియను పూర్తిచేయాలని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్ఓలు, రెవెన్యూ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చనిపోయిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారిని గుర్తించి, ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటరు నమోదు చేసి, ఓటరుకు ఆధార్ కార్డు అనుసంధానం చేయించాలని బీఎల్ఓలకు ఆదేశించారు.

కుల వివక్ష చూపితే కఠిన చర్యలు

సమాజంలో కులవివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని నడింపల్లి అరుంధతి వాడలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా కుల వివక్ష చూపిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్ఐ హరి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

పీహెచ్‌సీలో సుఖ ప్రసవం



పూతలపట్టు: మండలం కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం ఓ గర్భిణికి వైద్యులు సుఖ ప్రసవం చేశారు. పూతలపట్టుకు చెందిన గర్భిణి రమ్య ప్రసవం కోసం స్థానిక పీహెచ్‌సీని ఆశ్రయించింది. పురిటినొప్పులు అధికం కావడంతో వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణ స్పందించి సురక్షిత ప్రసవం చేశారు. గర్భిణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఆస్పత్రిలో ఇది రెండో కాన్పు అని అధికారులు పేర్కొన్నారు.

‘మ్యుటేషన్ దందా’లో సర్పంచులూ బాధితులే

- లంచమిస్తేనే పనిచేస్తామంటున్న వీఆర్వోలు
- మండలాధికారులకు వాటాలు నిజమే
- కలెక్టర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసిన ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి

గుడిపాల: గ్రామ స్థాయిలో పంచాయతీకి సర్పంచులే కీలకం. అయితే మండలంలో మాత్రం సర్పంచులైనా లంచమిస్తేనే పనిచేస్తామంటూ వీఆర్వోలు తెగేసి చెబుతున్నారు. మండలాధికారులకు వాటాలు ఇవ్వకుంటే పని చేయరని, అందుకే లంచం తీసుకుంటామంటూ వీఆర్వోలు నేరుగా సర్పంచ్‌లకే చెప్పడం గమనార్హం. దీంతో సర్పంచులు కూడా డబ్బులిచ్చి పనులు చేసుకోవాల్సి వస్తోంది.

ఫోన్‌కు స్పందించని తహసీల్దార్

మ్యుటేషన్ దందా బహిర్గతం కావడంతో మండల రెవెన్యూ అధికారులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. డెప్యూటీ తహసీల్దార్ కళ్యాణి శనివారం వీఆర్వోలకు హితబోధ చేశారు. అయితే ఇలాంటి హెచ్చరికలు, మందలింపులన్నీ ఉత్తుత్తివేనని స్పష్టమవుతోంది. ఎందుకంటే మండలాధికారులకు ఎవరెవరికి ఎంతెంత వాటాలు వెళుతున్నాయో వీఆర్వోలు సర్పంచ్‌లకు వివరంగా చెప్పేశారు. దీంతో మండలాధికారులు దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. తహసీల్దార్ అయితే పని వేళల్లో కూడా అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు. ఎవరు ఫోన్ చేసినా స్పందించడం లేదు. దీంతో మండలాధికారులకు వాటాలు అందుతున్నాయని విషయం నిజమేనన్న చర్చ మండలంలో సాగుతోంది. అధికారులు ఈ గండం నుంచి ఎలా తప్పించుకోవాలా అన్న ఆలోచనలో పడ్డారు.



Gudipala revenue employe negligence

yatheendra 19:28

Respected sir, My name is M Yatheendra Kumar, i am serving in INDIAN AIR FORCE, as a crew member of MI-17 Series helicopters from 20 years & presently posted in AFS, YELAHANKA. Sir, i belongs to Gudipala village, my father registered his property to me and my younger brother, sir my property needs to enered in online by mandal revenue employes and VRO's, for preparation of passbooks etc .For same i applied and submited all documents to ex VRO namely YADUNANDAN gaaru mob: 9441445650, before 6 months,he assured me in a week i get OTP, and with that he Will fulfil all needful, i rang him many times, i could not visit again due to AERO INDIA 2023. Now he has thrown my documents somewhere, blocked my number, present VRO namely Ramesh gaaru mob: 9701270572, saying my documents were not handed over to him. MRO sir not lifting any call.

Sir, Hence i request to help me solving my problem by communicating with GUDIPALA revenue department

కలెక్టర్ కార్యాలయానికి మెయిల్ ద్వారా పంపిన ఫిర్యాదు

అయ్యా కలెక్టర్ గారూ..

మాది గుడిపాల మండలకేంద్రం. నేను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్నా. ఏడాది క్రితం నా తండ్రి పార్థసారథినాయుడు రెండెకరాల పొలాన్ని యతీంద్ర కుమార్ నా పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడు. అప్పటి నుంచి మ్యుటేషన్ కోసం తిరుగుతూనే ఉన్నాను. స్థానిక వీఆర్వో డాక్యుమెంట్లు దగ్గర పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో పదిరోజుల సెలవుపై వచ్చాను. వెంటనే వీఆర్వోను సంప్రదించగా, ఆ డాక్యుమెంట్లు ఎక్కడో పోయాయి. కొత్తగా ఇవ్వాలని చెప్పడంతో మళ్లీ ఒక సెట్ తీసుకొచ్చి ఇచ్చాను. ఇంత వరకు మ్యుటేషన్ పెట్టక పోవడంతో రెండు రోజుల క్రితం నేను కలెక్టర్ కార్యాలయానికే ఫిర్యాదు మెయిల్ ద్వారా పంపాను. ప్రస్తుతం వీఆర్వో నా నెంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాడు, తహసీల్దార్‌కు ఫోన్‌చేస్తే తీయడం లేదు. ఇదే విషయమై కలెక్టర్ కార్యాలయానికి మెయిల్ పంపాను.



యతీంద్ర, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి

డబ్బులిస్తేనే పనిచేస్తారట



గుడిపాల మండలంలో 2021లో సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. రైతులు వీఆర్వో దగ్గరకు తిరిగి తిరిగి విసిగిపోయి నా వద్దకు వచ్చారు. దీనిపై వీఆర్వోను కలిసి మాట్లాడితే, ‘‘డబ్బులులిస్తేనే పని చేస్తామంటూ లేకుంటే లేదు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.’’ అంటూ ఆయన హుకుం జారీ చేశారు. దీంతో ఎంతో కొంత ఇచ్చి చేసుకోమని చెప్పాల్సి వచ్చింది. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్, మరకాలకుప్పం

తహసీల్దార్ స్పందించడం లేదు.



వీఆర్వోలకు ఫోన్‌చేస్తే ఎవ్వరూ తీయరు. తహసీల్దార్‌కు ఫోన్ చేసినా తీయరు. ఇకవేళ నేరుగా వెళ్లి అడిగితే టెలి కాన్ఫరెన్స్ అంటారు. ఎప్పుడూ వీరికి కాన్ఫరెన్స్‌లే తప్ప ప్రజల సమస్యలు పట్టవా? మా పంచాయతీలో చాలా మంది రైతుల మ్యుటేషన్, సర్టిఫికేట్‌లకు సంబంధించి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందించక పోవడంతో కార్యాలయానికి పోవడమే మానేశా. సర్పంచ్‌లకే స్పందించకుంటే సామాన్యులను ఎవరు పట్టించుకుంటారు.?

– నారాయణమూర్తి, సర్పంచ్, గుడిపాల

ముగిసిన శతావధానం



శతావధానంలో ఆముదాల మురళి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం పీవీకేఎన్ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన ఆముదాల మురళి శతావధానం కార్యక్రమం శనివారంతో ముగిసింది. వేదికలో 20 మంది పృచ్ఛకులు అడిగిన సమస్య దత్తపది వర్ణనకు ఆశువుగా పద్యరూపం, చమత్కార పద్యాలతో బదులిచ్చారు. దీంతో శతావధానం ముగిసింది. యువ అవధాని భరత్ శర్మ అనుసంధానం చక్కగా ఉందని పలువురు కొనియాడారు. అనంతరం ఆముదాల మురళిని జెడ్పీసీఈఓ ప్రభాకర్‌రెడ్డి, రచయితలు బూదుగూరు బాలరాజు, ప్రజాహిత సేవా సంస్థ అధ్యక్షుడు రాజరత్నంరెడ్డి ఘనంగా సన్మానించారు.

సత్రం దేవదాయశాఖదే

చిత్తూరు రూరల్: నగరంలోని సంతపేటలో ఉన్న శ్రీపురం వెంగ్రాయ శెట్టి సత్రం దేవదాయశాఖకు చెందిందని ఈఓ మునిశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1916లో మునస్వామి శెట్టి కుమారుడు శ్రీపురం వెంగ్రాయశెట్టి ఆ సత్రాన్ని దేవదాయశాఖకు చెందినట్లు వీలునామా రాసి ఇచ్చినట్లు తెలిపారు. సత్రం దేవదాయశాఖకు చెందిందని, బహిరంగ వేలంలో లీజుకు ఇస్తే సత్రానికి ఆదాయం వస్తోందనే విషయాన్ని ప్రకటనలో పేర్కొన్నారు.

గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయండి

బంగారుపాళెం: గృహ నిర్మాణ పనులను అధికారులు సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ తులసి అన్నారు. మండలంలోని పాలేరులోని జగనన్న కాలనీలో శనివారం గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. కాలనీలో పనులు 75 శాతం వరకు పనులు జరుగుతుండడంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. డ్వాక్రా గ్రూపుల్లోని సభ్యులకు ఇళ్లను నిర్మించుకునేందుకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం పాలేరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మీరాబాయి పాల్గొన్నారు.



పాలేరు: రికార్డులు తనిఖీ చేస్తున్న పీడీ తులసి

నాడు–నేడు పనులు వేగవంతం

పూతలపట్టు: ప్రభుత్వ బడుల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని ముత్తిరేవుల ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ప్రహరీ గోడల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా క్లిష్టమైన సబ్జెక్టులను చదవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు అందుబాటులో వైద్యం

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో అందరికీ అందుబాటులో వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని మాధవరంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌వేలు 65 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, చాముండేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, డీఈఓ విజయలక్ష్మి, ఆశావర్కర్లు ద్రాక్షాయణి, సావిత్రి పాల్గొన్నారు.

కమ్మపల్లెలో..

ఐరాల: మండలంలోని కమ్మపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ 104 వైద్య శిబిరంలో 55 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓలు శివయ్య, సిరాజుద్దీన్, పీహెచ్ఎన్ వేదవతి, ఎంపీహెచ్ఎస్ నాగరత్నమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్



మాధవరంలో వైద్య బృందం

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వైద్యాధికారి కళారి కుమార్ అన్నారు. మండలంలోని కిల్లారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటివద్దకు వెళ్లి వైద్య పరీ క్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. సిబ్బంది సుమతి, హరిప్రియ, చంద్ర, ఎలవతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



శిక్షణలో మాట్లాడుతున్న కరుణకుమార్

చిత్తూరు అర్బన్ : మధ్యవర్తిత్వ విధానంతో కేసులు పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్ అన్నారు. నగరంలోని పాత జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయ సేవాసదన్ భవనంలో శనివారం జూనియర్ న్యాయవాదులకు మధ్యవర్తిత్వ విధానంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. కోర్టులు, పోలీసు స్టేషన్లకు వెళ్లకుండానే మధ్యవర్తిత్వం ద్వారా సత్వర న్యాయాన్ని పొందవచ్చని చెప్పారు. దీంతో సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

భీముని బండి ఊరేగింపు



యాదమరి: మండలంలోని లక్ష్మయ్యకండ్రిగ గ్రామంలో ఉన్న ధర్మరాజుల ఆలయం నుంచి పలు గ్రామాల్లో భీముని బండి ఊరేగింపు వేడుకగా నిర్వహించారు. శనివారం ఉదయం ఆలయంలో వెలసిన ద్రౌపదీ ధర్మరాజులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భీముని బండికుంభం సిద్ధం చేసి గ్రామాల్లో ఊరేగించారు.

చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యం

గుడిపాల: చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పానాటూరు సర్పంచ్ మధుపల్లవి అన్నారు. మండలంలోని పానాటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షికోత్సవ సమావేశం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీపడి చదివితే సమాజాభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. అయిదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించమని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సాంకేతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పానాటూరు క్లస్టర్‌లోని 8 పాఠశాలల్లో 5వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 8 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.వెయ్యి చొప్పున ఆమె అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు బహుమతి అందజేస్తున్న సర్పంచ్ మధు పల్లవి

వేసవి శిబిరానికి సహకరిస్తాం

ఐరాల: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిబిరానికి అన్ని విధాలా సహకరిస్తామని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శనివారం ఎంఈఓను గ్రంథాలయాధికారి సుజాత కలిసి సమ్మర్ క్యాంపు నిర్వహణ, విద్యార్థుల హాజరు తదితర వాటిపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ మే 8 నుంచి 16వ తేదీ వరకు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంఘ సభ్యులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న మహిళలు

యాదమరి: కుటుంబ పెద్దలను కోల్పోయిన ముగ్గురు స్వయం సహాయక సంఘాల సభ్యులకు తోటి సభ్యులు రూ.లక్ష ఆర్థిక సాయం చేసి ఉదారతను చాటుకున్నారు. మండలంలోని కృష్ణంపల్లె స్వయం సహాయక సంఘ సభ్యులైన దేవి, సరళ, మాధవరం గ్రామానికి చెందిన కోమల భర్త వేర్వేరు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. దీంతో వారి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ ముగ్గురు సంఘ సభ్యులకు చెందిన 8 మంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.12,500 చొప్పున మొత్తం రూ.లక్ష బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్ చేసి ఉదారతను చాటుకున్నారు.

పేదలకు దేవుడిచ్చిన వరం సీఎం జగన్





ఎద్దులవారిపల్లెలో పర్యటిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, చిత్తూరులో మీడియాతో మాట్లాడుతున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- పక్షపాతం లేకుండా సంక్షేమం
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబు

బంగారుపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన పేదలకు దేవుడిచ్చిన వరమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని కాటప్పగారిపల్లె, దళితవాడ, ఎగువ, దిగువ ఎద్దులవారిపల్లె గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే నాయకులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అక్క చెల్లెమ్మలు, రైతులు, వృద్ధులు, యువకులతో మాట్లాడారు. గడిచిన నాలుగేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలు

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, ఇళ్లకు దగ్గరగా ఉన్న విద్యుత్ తీగలను మార్పుచేయాలని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొందరికి అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదని విన్నవించారు. సీసీ రోడ్లు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు వంటి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచ్‌లు కే.బాలాజీ, భారతమ్మ, సుబ్రమణ్యం, బాలాజీ, ఎంపీటీసీ సభ్యులు హరి, ఇందుశేఖర్‌రెడ్డి, హేమచంద్ర, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలీశ్వర్, సింగిల్‌విండో, మార్కెట్ కమిటీ చైర్మన్లు దత్తాత్రేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

మళ్లీ జగనన్ననే గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు వస్తాయని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని కాటప్పగారిపల్లెలో శనివారం జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్–మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. నియోజకవర్గంలో 85,961 గృహాలకుగాను 72,691 గృహాలను సందర్శించినట్లు వివరించారు. 50,038 మంది మద్దతు తెలిపారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


చిత్తూరులో 66,167 కుటుంబాల మద్దతు

చిత్తూరు కార్పొరేషన్: ‘జగనన్నే మా భవిష్యత్’ మెగా పీపుల్స్ సర్వే దిగ్విజయంగా ముగిసిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 7న సర్వే ప్రారంభమైందన్నారు. నియోజకవర్గంలో 78,230 గృహాలు ఉండగా అందులో 66,167 కుటుంబాలు జగనన్నకు మద్దతుగా మిస్డ్‌కాల్స్ ఇచ్చినట్లు గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారు. వారందరి కృషితో వందశాతం సర్వే పూర్తి చేశారని అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా మద్దతు అభిప్రాయసేకరణ చేసి స్టిక్కర్లు అతికించారని చెప్పారు. గత నాలుగేళ్లలో జరిగిన మేలును ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశామన్నారు. నగర సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కిరణ్, మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, జిల్లా ప్రచార కార్యదర్శి రాజా, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ‘జగనన్నే మా భవిష్యత్’

పూతలపట్టు: జగన్ననే మా భవిష్యత్ కార్యక్రమం మండలంలో శనివారం విజయవంతంగా ముగిసిందని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బందార్లపల్లి , ఆకనంబట్టు గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి తలుపులకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో అభయ సాయి సంస్థ అధినేత లోకేష్‌రెడ్డి, ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ దేవిక, నిరంజన్‌రెడ్డి, ప్రవీణ్, సచివాలయ కన్వీనర్ కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడికి సూచనలు



పొలంబడి సమావేశంలో రైతన్నలు

గుడిపాల: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పానాటూరులో శనివారం పొలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరిసాగులో సమగ్ర పంటల యాజమాన్యం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం, రైతును స్వయం నిర్ణయాధికారిగా తయారుచేయడం వంటి విషయాలపై రైతులకు వివరించారు. సమగ్ర సస్య రక్షణ విధానాలతో రసాయన పురుగు మందులు వాడకం తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షిస్తూ సుస్థిర దిగుబడులు సాధించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాధవి, సర్పంచ్ మధుపల్లవి, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు తులసీరాం రెడ్డి, భువనేశ్వరి, లేప్మ, ప్రమీల, హనుమనాయక్, వాణి, శ్రీకాంత్, సోనియా, రైతులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు టీకాలు తప్పనిసరి

గుడిపాల: ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కిల్లారిపల్లెలో శనివారం వ్యాధి నిరోధక టీకాలు, వేసవిలో తీసుకోవాల్సిన ఆరోగ్యజాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఏ గర్భిణీ జన్మనిస్తూ మరణించకూడదు, ఏ శిశువూ మరణించడానికే పుట్టకూడదు అనే నినాదంపై గర్భిణిలు, తల్లులకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన తరువాత వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ప్రతి చిన్నారికి వేసినపుడే వ్యాధులని తరిమికొట్టవచ్చన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తాజా ఆహారాన్ని తీసుకొని అన్నిరకాల ఆకుకూరలు, కాయగూరలతో పాటు సీజనల్ పండ్లను తినాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కుప్పమ్మ, హరిప్రియ, సీహెచ్‌ఓ సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

యాదమరి: గ్రామాల్లో ఉన్న బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించాలని 14 కండ్రిగ ముస్లింవాడ ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్ఎం భాస్కర్ రావు కోరారు. పాఠశాల ఆవరణలో శనివారం పాఠశాల సామాజిక తనిఖీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరంలో విద్యార్థుల పురోగతి, నాడు–నేడు కార్యక్రమంలో తల్లిదండ్రుల బాధ్యతలు, పాఠశాల ఆడిట్‌లో ఖర్చులపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని కార్పొరేట్ పాఠశాలలు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. గ్రామాలలో ఉన్న బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లి దండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవాన్ని జయపద్రం చేయండి

చిత్తూరు కార్పొరేషన్: కార్మిక దినోత్సవం మేడేను జయపద్రం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. కార్మికుల పండుగ రోజున వాడవాడలా కార్మిక జెండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు.